నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 23: టీఎస్ఎస్‌పీడీసీఎల్ అజామాబాద్ డివిజన్ 11కెవి బౌద్ధనగర్ ఫీడర్ పరిధి లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం (నేడు)విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అజామాబాద్ డివిజన్ ఏడీఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద యం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బౌద్ధనగర్ ఫీటర్ పరిధిలోని బౌద్ధనగర్, కౌసర్ మసీద్, వారసిగూడ, ఆర్ట్స్ కాలేజ్, బాలాజీ కమ్యూనిటీ హాల్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్న ట్లు తెలిపారు.

మాల విద్యార్థి, యువగర్జన వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 25న నిర్వహించనున్న మాల విద్యార్థి, యువగర్జనను వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ మాల విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చినేని వెంకట్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పై నియమించిన ఏక సభ్య కమిషన్ కాల పరిమితిని పొడగించడంతోపాటు వచ్చే నెల మొదటి వారంలో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి వర్గీకరణ బిల్లును ఆమోదించాలని ప్రభుత్వం నిర్ణయించిదని అన్నారు. వచ్చే నెల మూడున నిర్వహించనున్న విద్యార్థి యువజన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భవిష్యత్తుపై చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. మాలలకు తీవ్ర అన్యాయం జరిగే వర్గీకరణకు వ్యతిరేకంగా నిరంతరం ఆందోళనలు, పోరాటాలు కొనసాగిస్తామని చెప్పారు.

అన్నదానం

బన్సీలాల్ పేట్, ఫిబ్రవరి 23: ఆకలితో అలమటిస్తున్న అనాథలు, నిరాశ్రయులకు స్కై ఫౌండేషన్ సభ్యులు ఆదివారం జరిగిన 271వ అన్నదాన నిర్వహించారు. వైద్యం, బట్టలు అందించించామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవకుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు నేహా అన్సారీ, ఇర్ఫాన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సీతామార్కండేయ



సీతామార్కండేయకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రతినిధులు

కవాడిగూడ, ఫిబ్రవరి 23: భోలకపూర్ పద్మశాలి కాలనీలో ప్రసిద్ధిగాంచిన సంజీవ హనుమాన్ దేవాలయ నూతన కమిటీ అధ్యక్షుడిగా సీతామార్కండేయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం కాలనీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజీవ హనుమాన్ దేవాలయం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సీతా మార్కండేయ, ఉపాధ్యక్షులుగా దావత్ మచ్చేంద్ర నాథ్, జితేందర్, కార్యదర్శిగా పుండరీకం,, సంయుక్త కార్యదర్శిగా బి.వినోద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.వెంకటేష్, కోశాధికారిగా గడ్డం నవీన్, సలహాదారులుగా బింగి కృష్ణ, ఆంజనేయులు, శ్యామల, పద్మలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు సీతా మార్కండేయకు ఎన్నికల అధికారి రాజాపేట ఆంజనేయులు, బిఆర్ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సీనియర్ సభ్యులు బింగి నవీన్ నియామక పత్రాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. దేవాలయ అభివృద్ధికి అంకితభావంతో తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా మార్కండేయ తెలిపారు.

కాలనీల అభివృద్ధికి కృషి చేయాలి

బేగంపేట, ఫిబ్రవరి 23: ప్రజలకు అందుబాటులో ఉంటూ కాలనీల అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని డీఎన్ఎం కాలనీ అభివృద్ధి కమిటీ నూతన సభ్యులు ఆదివారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే అన్నారు. కాలనీ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో కాలనీ చైర్మన్ నోమా నోద్దీన్, అధ్యక్షుడు జమీర్, ప్రధాన కార్యదర్శి మన్నన్, ఉపాధ్యక్షుడు శంషీర్, అబ్దుల్ రహీం, సర్దార్ తదితరులు ఉన్నారు.

దివంగత ఎమ్మెల్యే లాస్యనందితకు నివాళి

కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే జి.లాస్యనందిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలువురు నాయకులు, కార్యకర్తలు

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 23: కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే జి.లాస్యనందిత ప్రథమ వర్ధంతి కార్యక్రమం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏఎల్ ఆనంద్ ఆధ్వర్యంలో పికెట్ చౌరస్తాలో జరిగింది. దివంగత బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే లాస్య నందిత చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై పూలమాల వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు నల్ల రాజు, సతీష్ కుమార్, గంగరామ్, శత్రు, కిరణ్ కుమార్, పెంటా శ్రీహరి, సానాధి శ్రీనివాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ ఉత్సవాలు

ఉత్సవాల్లో పాల్గొన్న వి.శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 23: ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో ఆదివారం రాత్రి గ్యార్వీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక జమ్‌జమ్ మసీదు వద్ద జరిగిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నేత వి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహ్మద్ జాహంగీర్, ఎండీ గౌస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిరిగిరి శ్యామ్, కార్తీక్ యాదవ్, సిద్దిఖి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మైనార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సత్కరించి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పద్మారావునగర్‌లోని జమ్ జమ్ మసీదు చిల్లా వద్ద

బన్సీలాల్‌పేట్: పద్మారావునగర్‌లోని బాపూజీనగర్ ముస్లిం యూత్ అసోసియేషన్ జమ్ జమ్ మసీదు చిల్లా వద్ద జాకిర్, మొహిద్‌గౌస్, జహంగీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్వీ షరీఫ్‌ఉత్సవాలు నిర్వహించారు. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ హాజరయ్యారు. బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు, బాలకృష్ణ, మహేందర్‌గౌడ్, హరిచారి, సాయిరాంచారి, సౌండ్ రవి, తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మకమైన విద్యను అందించాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 23: విద్యార్థులకు గుణాత్మకమైన విద్యనందించి, సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దోమలగూడ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల మైదానంలో నిర్వహించిన రాక్ వుడ్స్ హైస్కూల్ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో పతిభను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, హైకోర్టు పీపీ నాగేశ్వరరావు, ఇగ్నో రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె.రమేష్, హిమాయత్‌నగర్ మండల డిప్యూటీ ఐఓఎస్ ఆర్.సుమన్, జీవనజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ జార్జిరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ రుత్విక్‌రెడ్డి, చైర్మన్ లార్డ్‌మార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భక్తియారిని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

కవాడిగూడ, ఫిబ్రవరి 23: తెలంగాణ రికగ్నైజేషన్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రిస్మా) అధ్యక్షుడిగా నియమితులైన రేడియంట్ హై స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ అహ్మదుల్లా భక్తియారిని భోలకపూర్ బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మునావర్ చాంద్, అక్లాక్ హుస్సేన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం భక్తియారిని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముషీరాబాద్ మండలం ట్రిస్మా అధ్యక్షుడిగా అహ్మదుల్లా భక్తియారి నియమితులు కావడం శుభ పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాజా, ఆదిల్, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

అనురాగ దంపతులకు పురస్కారాలు

పురస్కార గ్రహితలతో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

ముషీరాబాద్, ఫిబ్రవరి 23: శిఖరం ఆర్ట్ థియేటర్స్, రఘు అరికపూడి సేవా ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో కళా తపస్వీ పద్మశ్రీ డాక్టర్ కె.విశ్వనాథ్ జయంతి కార్యక్రమం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగాయి. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని అనురాగ దంపతులకు పురస్కారాలను అందచేశారు. కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్త, విద్యాసాగర్, దైవజ్ఞశర్మ, డి.చక్రపాణి, అరికపూడి రఘు, శివనరసింహన్ స్వామి, వంశీ, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను జాతీయ ఎస్సీ కమిషన్ అడ్డుకోవాలి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 23: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను జాతీయ ఎస్సీ కమిషన్ తక్షణమే అడ్డుకోవాలని, వర్గీకరణతో నేతకాని, మహర్ కులాలకు తవ్ర నష్టం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర నేతకాని, మహర్ కుల సంఘం అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ తెలిపారు. జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ (నూఢిల్లీ)కి వినతి పత్రం సమర్పించారు. జాతీయ ఎస్సీ కమిషన్ ప్రాంతీయ డైరెక్టర్ (హైదరాబాద్)కు అందజేశారు. మాలమహానాడు జాతీయ కమిటీ గౌరవాధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 క్లాస్ 9 ప్రకారం జాతీయ ఎస్సీ కమిషన్‌ను సంప్రదించకుండా వర్గీకరణ పేరుతో మాదిగ కులాలకు ఎక్కువ రిజర్వేషన్ అవకాశాలు కల్పించి కాంగ్రెస్ ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నదని విమర్శించారు.

రాష్ట్రపతి నిలయంలో కళా సంధ్య వేడుకలు

సాంస్కృతిక ప్రదర్శనతో అలరిస్తున్న విద్యార్థులు

బొల్లారం, ఫిబ్రవరి 23: కళావేత్తలకు, సాంస్కృతిక ప్రేక్షకులకు ఒక అద్భుతమైన అనుభూతిని అందించేందుకు కళా సంధ్య సాంస్కృతిక జ్ఞానాన్ని పెంపొందించేందుకు కళా సంధ్య వేడుకలు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్రపతి నిలయం అధికారి రజినిప్రియ తెలిపారు. ఆదివారం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో కళా సంధ్య వేడుకల్లో భాగంగా దేశంలోని వివిధ నృత్య కళల ప్రదర్శనతో పాటు నాట్యమండనలి బృందాలు పాల్గొన్నాయని తెలిపారు. ఈ కళా సంధ్యలో శ్రీలంక యూనివర్సిటీ ఆఫ్ విజువల్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్ సెంటర్ ఫర్ సైకాలజికల్ హెల్త్ శాఖ మాజీ అధిపతి డాక్టర్ అంజలి మిశ్రా తన బృందంతో కలిసి కథక్ నృత్యం ప్రదర్శనతో అలరించారు. శ్రీలంక నృత్యమైన కండ్యాం, భరతనాట్యంలోని కొన్ని రూపాలను ప్రదర్శించారు. వారాంతం సాయంత్రాల్లో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమాలకు రాష్ట్రపతి నిలయం వేదిక కానున్నదని పేర్కొన్నారు. సందర్శకుల నిమిత్తం సంవత్సరం పొడవున మంగళవారం నుండి శుక్రవారం వరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, ఆదివారం ఉదయం 10 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు తెరచి ఉంటుందని, సందర్శకులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని వెల్లడించారు.

మహోన్నత ఇంద్రజాలికుడు పీసీ సర్కార్

సమావేశంలో మెజీషియన్స్ ఆంజనేయులు, వసంత్ తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 23: తన అద్భుత ప్రదర్శనల ద్వారా దేశకీర్తిని ప్రపంచానికి చాటిన మహోన్నత ఇంద్రజాలికుడు పీసీ సర్కార్ అని తెలుగు రాష్ట్రాల ఇంద్రజాల ప్రముఖులు అన్నారు. సీనియర్ పీసీ సర్కార్ జయంతి సందర్భంగా ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాద్ మెజీషియన్స్ గ్రూప్ బాధ్యుడు రామడుగు వసంత్ అధ్యక్షతన సమావేశం జరిగింది. కార్యదర్శి ఆంజనేయులు, తెలుగు మెజీషియన్స్ గ్రూప్ నేతలు అలీ, ప్రదీప్ రంగరేజ్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం కార్యదర్శి కె.వీరయ్య హాజరై పీసీ సర్కార్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్కార్ బాటలో సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని, అయనను ఆదర్శంగా తీసుకొని తెలుగు రాష్ట్రాల్లో ఇంద్రజాల రంగాన్ని మరింతగా విస్తృత పరచాలని అన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

చార్మినార్, ఫిబ్రవరి 23: మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ కుటుంబానికి భరోసా కల్పించాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఆదివారం యాకుత్‌పుర నియోజకవర్గం రెయిన్ బజార్ డివిజన్‌లోని ఇమిలీబన్ ప్రాంతంలో స్థానిక మహిళలకు కుట్టుమిషిన్లు పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక సమస్యలు లేకుండా వారి ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. కుట్టుమిషిన్లు అందిస్తూ, ఇంటివద్దనే మహిళలు ఉపాధి పొందే విధంగా సహకారం అందిస్తున్నామని తెలిపారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవం

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 23: బోయగూడ షిరిడి సాయిబాబా మందిరం 12వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బొడ్డు మహేష్ ఆధ్వర్యంలో సాయిబాబా విగ్రహానికి అభిషేకం చేశారు. పూజలు నిర్వహించి, పేదలకు అన్నదానం నిర్వహించారు. పలువురి ప్రముఖులు ఆలయానికి సంబంధించిన సాయిబాబా ఆశీస్సులు పొందారు. భక్తులు దాతలు అందిస్తున్న సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి పరుస్తున్నామని అధ్యక్షుడు మహేష్ తెలిపారు. భక్తితో సహకరించి, ప్రోత్సాహం ఇస్తున్న దాతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

25, 26వ తేదీల్లో పూజలు

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 23: మహా శివరాత్రిని పురస్కరించుకొని మారేడ్‌పల్లిలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఈ నెల 25, 26వ తేదీల్లో ఆలయ ఆవరణలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీన ఉదయం 9:30 గంటలకు రుద్రహోమం, సాయంత్రి 6:30 గంటలకు శివ కళ్యాణం, ఈ నెల 26వ తేదీన ఉదయం 5 గంటలకు మహన్యాసపూర్వక ఏకరుద్రాభిషేకం, ఉదయం 8 గంటలకు హారతి మంత్ర పుష్పం, 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంతత ధారాభిషేకం, 5 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు అష్టోత్తర శత నామార్చన, రాత్రి 10 గంటలకు 108 కళశాలతో అభిషేకం తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయని చైర్మన్ వెల్లడించారు. 25వ తేదీన కళ్యాణం, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. భక్తులందరూ పెద్ద ఎత్తున హాజరై ఈ ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొనవల్సింగా ఆయన కోరారు.

యువతి అదృశ్యం

కాచిగూడ, ఫిబ్రవరి 23 : మెడికల్ షాప్‌కు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ వీరన్న గుట్ట ప్రాంతానికి చెందిన భాను శ్రీ (23) శనివారం ఉదయం మెడికల్ షాప్‌కు వెళ్లి ఇంటికి రాకపోవడంతో కలత చెందిన కుటుంబ సభ్యులు, మేనమామ శివరాజ్ కాచిగూడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

రంగరాజగౌడ్ అందించిన సేవలు ఎనలేనివి

కవాడిగూడ గౌడ సంఘం చైర్మన్ రంగరాజుగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కవాడిగూడ, ఫిబ్రవరి 23: కవాడిగూడ గౌడ సంఘం చైర్మన్‌గా రంగరాజుగౌడ్ ఎనలేని సేవలు అందించారని కవాడిగూడ టాపర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు దూడల శంకర్‌గౌడ్, కవాడిగూడ గౌడ సంఘం అధ్యక్షుడు సానం హరీష్ గౌడ్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కవాడిగూడ గౌడ సంఘం చైర్మన్ రంగరాజుగౌడ్ సంతాప సభ ఆదివారం కవాడిగూడలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొని రంగరాజుగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగరాజుగౌడ్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు అంజయ్య గౌడ్, మద్దెల చంద్రయ్యగౌడ్, లింగాల ప్రకాష్ గౌడ్, ప్రతాప్‌గౌడ్, సత్యనారాయణ గౌడ్, సంపత్‌కుమార్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, నవీన్‌గౌడ్, అమర్, దశరథ్, జహంగీర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కులగణనపై బీసీ కమిషన్ అవగాహన

కవాడిగూడ, ఫిబ్రవరి 23: బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కులో ఆదివారం కులగణనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యుడు రాపోలు జయప్రకాష్ పాల్గొన్నారు. ఇందిరాపార్కులో ప్రజలను కలిసిన వారు కులగణన జరిగిన తీరుపై అడిగి తెలుసుకున్నారు. అనేక మంది ప్రజలు కులగణనపై వారికి ఫిర్యాదులు చేశారు. ఎక్కువ శాతం మంది మేము అపార్ట్మెంట్స్‌లో ఉంటామని దోమలగూడ, గాంధీనగర్, బండ మైసమ్మనగర్, కవాడిగూడ, అశోక్‌నగర్ ప్రాంతాల్లో కులగణన సరిగా చేయలేదని చెప్పారు. తమ ఇంటికి ఎన్యుమరేటర్స్ వచ్చి స్టిక్కర్స్ అతికించారు. కానీ పేర్లు వివరాలు నమోదు చేయలేదని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం రెండో దఫా కులగణన చేస్తున్నదని తెలిపారు. తమ వివరాలు నమోదు కాని ప్రజలు మూడు పద్ధతుల ద్వారా వివరాలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. గ్రేటర్ పరిధిలో ఉండే వారైతే వార్డ్ కార్యాలయంలో జిల్లాల్లో అయితే ఎంపీడీవో కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నమోదు ప్రక్రియ ఉంటుందని అన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమం బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న, డీపీఓ సుధాకర్, రిసోర్స్ పర్సన్స్ అనిత, మహాలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు గుర్రం శంకర్, డాక్టర్ సుధాకర్ యాదవ్, చంద్రకళ, బాబు, మారిశెట్టి నర్సింగ్ రావు, జయేందర్ బాబు ఇందిరా పార్క్ మేనేజర్ ఆశిష్, సూపర్వైజర్ మానిక, ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్ ముదిరాజ్, నరేందర్, వరూధిని, తిరుపతిరెడ్డి తదితర వాకర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దోమలగూడ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వాలు విఫలం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో ప్రాథమిక, ఉన్నత విద్య వ్యవస్థలు ప్రైవేటు యాజమాన్యం ఆధీనంలోకి వెళ్లిపోయాయని, ప్రభుత్వ ఆధీనంలో 50 శాతంగా ఉన్న ప్రాథమిక, మాధ్యమిక విద్యలో మౌలిక వసతులు, విద్యార్థి నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ప్రైవేట్ బాట పడుతున్న దుస్థితి రాష్ట్రంలో నెలకొందని డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోషియేషన్ విమర్శించింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమాన విద్యా అవకాశాలు, నాణ్యమైన నైపుణ్యమైన విద్యకోసం డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (డీఆటీఏ) ఆవిర్భావం సందర్భంగా పలువురు వక్తలు విచ్చేసి ప్రసంగించారు. పలువురు వక్తలుగా ప్రసంగించారు.

చెస్ క్రీడను అభివృద్ధి చేయాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 23: తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ స్థాయి నుంచి చెస్ క్రీడను అభివృద్ధి చేయాలని తెలంగాణ డెమోక్రటిక్ చెస్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు కోరారు. తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ కు ఇటీవల జరిగిన ఎన్నికలు రాజ్యాంగబద్ధంగా కాకుండా, క్రీడాకారులకు స్థానం కల్పించకుండా ఏకపక్షంగా నిర్వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెస్ క్రీడాకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ డెమోక్రటిక్ చెస్ డెవలప్మెంట్ కమిటీ, హైదరాబాద్ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్క్ వద్ద చెస్ ఆడుతూ క్రీడాకారులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కంది రవి, పాల్ సింగ్, దయాబేతి, రాజ్‌కుమార్, మహేందర్, శ్రీహరి, నరేష్ మాట్లాడుతూ చెన్నై, కలకత్తాలతో సమానంగా తెలంగాణలో కూడా చెస్ సంస్కృతిని పెంచాలన్నారు. చెస్ క్రీడా నిర్వహణలో ప్లేయర్ ఫ్రెండ్లీ వాతావరణం నెలకొల్పాలని కోరారు. క్రీడాకారులు, కోచ్‌లు, ఆర్బిటర్లు, తల్లిదండ్రులతో రెగ్యులర్ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. చెస్ క్రీడాకారులకు స్పాన్సర్ షిప్ లను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో డెమోక్రటిక్ సెటప్ చెస్ గవర్నెన్స్ లో ఉత్తమ ప్రతిభవంతులకు పారదర్శకంగా ఆర్థిక సహాయం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చెస్ క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడు ఆత్మహత్య

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 23: మతిస్థిమితం సరిగ్గా లేని ఓ వ్యక్తి జీవితం పై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం...నిర్మల్ జిల్లాకు చెందిన శ్రీనివాస్ (18)కు గత కొంత కాలం నుంచి మానసికంగా మతిస్థిమితం లేదు. జీవితం పై విరక్తి చెందిన శ్రీనివాస్ గుండ్ల పోచంపల్లి- మేడ్చల్ రైల్వే స్టేషన్ల మధ్యన బోదన్ ఫ్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.